ఎన్ఎఫ్‌సిఎల్ ఆస్తుల బదలాయింపులు, రిజిస్ట్రేషన్లు నిలిపివేయండి

జిల్లా రిజిస్ట్రేషన్ అధికారికి సీపీఐ వినతి

విశాలాంధ్ర - కాకినాడ : ఎన్ఎఫ్‌సిఎల్ ఆస్తులను బదలాయింపులు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని దీన్ని వెంటనే నిలిపి వేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు జిల్లా కార్యదర్శి బోడకొండ సహాయ కార్యదర్శి తోకల ప్రసాదులు కాకినాడ జిల్లా రిజిస్ట్రేషన్ అధికారికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. కాకినాడ జిల్లా అభివృద్ధి కోసం కాకినాడ ప్రజలకు ఉపాధి కల్పన కోసం 1985లో దివంగత కెవికె రాజు కాకినాడలో యూరియా తయారీ కర్మగారాన్ని నిర్మించారని ఇక్కడ యూరియా హబ్‌గా అవుతుందనే ఉద్దేశంతో ఆనాడు కాకినాడ ప్రజలు ముఖ్యంగా యాళ్ళ వారు రైతులు ,ప్రభుత్వం జాయింట్‌గా 1000 ఎకరాలకు పైగా భూమిని సేకరించి పరిశ్రమ నిర్మాణం చేశారన్నారని వారు తెలిపారు. నేడు రాజు మనవడు నేటి ప్రభుత్వ పెద్దలు దురుద్దేశంతో ఎన్ఎఫ్‌సిఎల్ భూములు స్వాధీనం చేసుకోవడం కోసం గ్రీన్ కో అనే సంస్థ ద్వారా తప్పుడు ఒప్పందం చేసుకుని ఎన్ఎఫ్‌సిఎల్ ఆస్తులను అప్పనంగా కొట్టేయాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి వద్ద నుండి జిల్లా స్థాయి అధికారుల వరకు కుట్ర చేశారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా రిజిస్టర్ మాట్లాడుతూ ఇప్పటికే పై అధికారుల నుండి తమకు ఉత్తర్వులు వచ్చాయని, పలుమార్లు ఎన్ఎఫ్‌సిలను సందర్శించామని, మీరు ఇచ్చిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్‌కి అందజేస్తానని ఆమె అన్నారు.

డ్వాక్రా మహిళలకు ఆసరా రూ.9.70 కోట్లు పంపిణీ

విశాలాంధ్ర - అంబాజీపేట : అంబాజీపేట మండల పరిధిలో 1287 డ్వాక్రా గ్రూపులకు గాను రూ.9.70 కోట్లు విడుదల చేసినట్టు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు తెలిపారు. మంగళవారం అంబాజీపేట మార్కెట్ కమిటీ ఆవరణలో ఆసరా నాలుగో విడత పంపిణీ కార్యక్రమం జరిగింది. మండల పరిషత్ అధ్యక్షులు దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వేణుగోపాలరావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రధాన భూమిక మహిళా మణులేనని ప్రతి ఒక్క డ్వాక్రా మహిళలకు 4 విడతలుగా ఆసరా అందిందని తెలిపారు. అనంతరం స్వయం సహాయక సంఘాలకు 9 కోట్ల 70 లక్షల 56వేల 178 రూపాయలు చెక్కును అందజేశారు రాష్ట్రానికి మళ్లీ సిఎంగా జగన్ రావాలంటూ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు బూడిద వరలక్ష్మి, సొసైటీ చైర్మన్ దొమ్మేటి సత్యమోహన్, నాయకులు కోర్లపాటి కోట బాబు, ముతాబత్తుల ప్రశాంత్ కుమార్, నాగవరపు నాగరాజు ఏపిఎం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కాత్రేనికోనలో పనిచేయని ఎస్‌బిఐ ఏటీఎం

ఖాతాదారులకు ఇక్కట్లు

విశాలాంధ్ర - కాత్రేనికోన : కాత్రేనికోన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ వద్ద ఏటీఎం సక్రమంగా పనిచేయక ఖాతాదారులు ఇక్కట్లు పడుతున్నారు. ఇక్కడ డిపాజిట్ మిషన్ తరచూ పని చేయడం లేదు. ప్రతిసారి మరమ్మతులే. ఏటీఎం మిషన్‌కు అండర్ మెయింటెనెన్స్ అని కాగితం అంటించి చేతులు దులుపుకుంటున్నారు. వారంలో ఒకటి రెండు రోజులు మాత్రమే పని చేస్తోంది. సకాలంలో మిషన్ బాగు చేయించడానికి బ్యాంకు అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. తమకు ఏటీఎం ద్వారా అవసరమైనప్పుడు డబ్బులు రాక, డిపాజిట్ చేయడానికి ఇబ్బందిగా ఉందని వారు వాపోతున్నారు. బ్యాంకు లోకి వెళితే బయట సొమ్ము తీసుకోమని చెబుతున్నారని వారంటున్నారు. బయట ఏటీఎం మిషన్ పనిచేయక గతి లేని స్థితిలో అత్యవసరంగా ప్రైవేట్ వ్యాపారుల వద్ద కమీషన్ చెల్లించి నగదు తీసుకోవాల్సి వస్తుందని, అలాగే డిపాజిట్లు చేసుకుంటున్నామని వారు ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా ఏటీఎం మిషన్ నిర్వహణపై బ్యాంకు అధికారులు బాధ్యత తీసుకోవాలని, సకాలంలో డిపాజిట్ మిషన్ మరమ్మత్తు చేయించి అసౌకర్యం తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

17 వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర - కాకినాడ : రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ ఆధ్వర్యంలో ఫిబ్రవరి నెలలో పీస్, కన్ఫ్లిక్ట్ ప్రివెన్షన్, రీసోల్యూషన్ మంత్ పేరిట పలు కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోందని, అందులో భాగంగా ఈ నెల 17వ తేదీన ప్రపంచశాంతి-యువత పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరుగుతుందని రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ అధ్యక్షులు గోపు కాశీవిశ్వనాథ్ తెలిపారు. ఈ వ్యాసరచన పోటీలకు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ నిమిత్తం కాకినాడ నగరంలోని అన్ని పాఠశాలలకు క్లబ్ ప్రతినిధుల బృందం వెళ్ళిఆయా పాఠశాలల హెచ్ఎంలతో మాట్లాడి విద్యార్థులతో ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. మంగళవారం ఉదయం కాకినాడ ఆనందభారతి ప్రక్కన గల రాజీవ్ గాంధీ నగరపాలక ఉన్నత పాఠశాలను రోటరీ ప్రతినిధి బృందం సందర్శించింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు గోపు కాశీవిశ్వనాథ్, పాఠశాల హెచ్ఎం రాజు మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి అరిగెల వేంకటేశ్వరరావు, సభ్యులు పోలిశెట్టి ఈశ్వరరావు, ఇంటరాక్ట్ క్లబ్ చైర్ పివి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర - కరప : కరప మండల పాస్టర్స్ యునైటెడ్ ఫెలోషిప్ వ్యవస్థాపకులు రెవరెండ్ ఫాదర్ మేడపాటి రాజ కుమార్ ఆధ్వర్యంలో గొడ్డటి పాలెం గ్రామంలోని సీనియర్ పాస్టర్ మేడపాటి కృపావరం ఆధ్వర్యంలో శిలువ సన్నిధి చర్చిలో మంగళవారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. కరప మండల పాస్టర్స్ యునైటెడ్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ గంజా జాన్ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ మడికి సాల్మన్ రాజు, సెక్రెటరీగా మోసా థామస్, జాయింట్ సెక్రటరీ కొమ్ము ప్రసన్న రాజు, ట్రెజరర్ సిర్రా జాన్ భాస్కర్ ఎన్నికయ్యారు. మెంబర్లగా కొమ్ము దీనావతి, సవిలే కీర్తి, చాట్ల మనోహర్ రాజు, పూసాల జయప్రకాష్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఫెలోషిప్ చీఫ్ పేట్రన్ గాడ్విన్, పెలోషిప్ ముఖ్య సలహాదారులు కొమ్ము జాన్ క్రిష్టఫర్, సవిలే రాజేష్, పెలోషిప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిలో జాతీయ మహిళా దినోత్సవం

విశాలాంధ్ర - గండేపల్లి : ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతంగా జరుపుకున్నారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్, గ్రీవెన్స్ సెల్ వారి ఆధ్వర్యంలో విద్యార్థినిలకు వివిధ కార్యకలాపాలను నిర్వహించడం ద్వారా ఈ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు విద్యార్థినిలకు, మహిళా ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. డైరెక్టర్ యంవి హరనాథ్ బాబు, ఉపాధ్యక్షుడు యం సతీష్, ప్రిన్సిపల్ డాక్టర్ కె. సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి. నరేష్ ఈ కార్యక్రమానికి విచ్చేశారు. సరోజినీ నాయుడు-నైటింగేల్ ఆఫ్ ఇండియా అనే అంశంపై వ్యాస రచన, సైన్స్ అండ్ టెక్నాలజీలో మహిళల కీలక పాత్ర అంశంపై వక్తృత్వ పోటీని నిర్వహించింది. ప్రతిభను గుర్తించి అర్హులైన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేయడంతో ఉత్సాహంగా వేడుకలు ముగిశాయి. ఈ వేడుకను జరుపుకోవడంలో ఈసీఈ ప్రొఫెసర్ మరియు ఉమెన్ ఎంపవర్‌మెంట్ మరియు గ్రీవెన్స్ సెల్ కన్వీనర్ డాక్టర్ వి శైలజ, ఉ.యం. మాధవి, సభ్యులు కీలక పాత్ర పోషించారు.

సాధారణ ఎన్నికలకు సన్నద్ధం కావాలి

విశాలాంధ్ర - కాకినాడ : రాబోయే సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్, కాకినాడ పార్లమెంటు నియోజకవర్గం ఆర్వో డా కృతికా శుక్లా ఎన్నికల అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్యతో కలిసి ఎన్నికల ఆర్వోలు, ఈఆర్ఓలు, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు క్షుణ్ణంగా చదివి అవగాహన చేసుకుని, విశ్వాసం పెంపొందించుకొని అందరూ ఖచ్చితంగా పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన విధులను సజావుగా నిర్వర్తించాలన్నారు. ఇందుకోసం కావలసిన పరికరాలు సామాగ్రిని సమకూర్చుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలను ఓటరు తెలుసుకునే కార్యక్రమాన్ని బీఎల్వోలు పక్కాగా చేపట్టి ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా ప్రోత్సహించాలన్నారు. మహిళలు, దివ్యాంగులు, యువ ఓటర్ల కోసం మోడల్ పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలను పంపించాలని ఆమె తెలిపారు. ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు కోసం ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు దివ్యాంగులు, 80 సంవత్సరాలు దాటిన వృద్ధులకు ప్రత్యేకించి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వారి ఇంటి వద్దనే కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రసారమాధ్యమాలకు చేరవేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి మొదలుకొని బూతు స్థాయి అధికారులు, పోలింగ్ కేంద్రాల వారీగా నియమించబడిన అధికారులు, సిబ్బంది ఫోన్ నెంబర్లతో ఒక డైరెక్టరీని సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డి. తిప్పే నాయక్, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జే వెంకట్రావు, సీపీవో పీ త్రినాథ్, డీఆర్డీఏ పీడీ కె శ్రీరమణి, డ్వామా పీడి ఎ వెంకటలక్ష్మి, జిల్లా పౌర సంబంధాల అధికారి డి నాగార్జున, పలువురు ఏఆర్వోలు, ఏఈఆర్వోలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల తీరుతో గ్రామాల్లో ఉద్రిక్తత

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : ఇళ్ల స్థలాల విషయంలో గత రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రస్తుతం రెండు గ్రామాల ప్రజలు కొట్టుకునే పరిస్థితులు దాపురిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే నాగులపల్లి శివారు ఉప్పరగూడెం గ్రామ పెద్దలు గ్రామంలో ఉన్న పేదల ఇళ్ల స్థలాల నిమిత్తం గ్రామాన్ని ఆనుకొని ఉన్న రైతు భూమిని ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ఒప్పించారు. రెవెన్యూ అధికారులు నాగులపల్లి ఉప్పరగూడెం గ్రామాన్ని ఆనుకొని తీసుకున్న భూమిలో ఇసుకపల్లి ఉప్పరగూడెం గ్రామానికి చెందిన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వడం, రైతును ఒప్పించుకున్న నాగులపల్లి ఉప్పరగూడెం గ్రామస్తులకు పొన్నాడలో ఇవ్వడం జరిగింది. తాము రైతును ఒప్పించుకొని భూమి ఇచ్చేలా చేస్తే తమ గ్రామాన్ని ఆనుకొని ఉన్న భూమిలో ఇసుకపల్లి ఉప్పరగూడెం గ్రామం వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వడమేంటని, తమను తీసుకెళ్లి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఇళ్ల స్థలాలు ఇవ్వడం ఏంటి అని నాగులపల్లి ఉప్పరగూడెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం మీద నాగులపల్లి ఉప్పరగూడెం, ఇసుకపల్లి ఉప్పరగూడెం గ్రామాల మధ్య ఉద్రిక్త పరిస్థితిలు నెలకొన్నాయి. రెవిన్యూ అధికారులు మంగళవారం ఇసుకపల్లి, ఉప్పరగూడెం ఇళ్ల స్థలాల లబ్ధిదారులను తీసుకొని వెళ్లి నాగులపల్లి ఉప్పరగూడెం ఆనుకొని ఇళ్ల స్థలాల నిమిత్తం సేకరించిన భూమిలో స్థలాలను అప్పగించేందుకు ప్రయత్నించగా ఉద్రిక్త పరిస్థితులు తలెత్తయి. సమయానికి పోలీసులు వెళ్లడంతో వాతావరణం సద్దుమణిగింది. తమ గ్రామాన్ని ఆనుకొని సేకరించిన భూమిలో తమకు స్థలాలు ఇచ్చి మిగిలిన స్థలాలలో ఎవరికిచ్చినా మాకు ఇబ్బంది లేదని నాగులపల్లి ఉప్పరగూడెం గ్రామ పెద్దలు చెప్పారు. నాగులపల్లి ఉప్పరగూడెం వారికి పొన్నాడలో ఇచ్చి నాగులపల్లి ఉప్పరగూడెంలో ఉన్న భూమిలో ఇసుకపల్లి ఉప్పరగూడెం వారికి ఇస్తే తప్పనిసరిగా కొట్లాటకు దారి తీసే అవకాశం ఉందని రెవెన్యూ అధికారులు ఈ విషయంపై పూర్తిగా దృష్టి పెట్టి న్యాయం చేయాలని నాగులపల్లి ఉప్పరగూడెం గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రత్తిపాడు టిడిపి ఇన్‌చార్జి తీరుపై తెలుగు తమ్ముళ్ల నిరసన

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ప్రత్తిపాడు టిడిపి ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ తీరును నిరసిస్తూ ఏలేశ్వరంలో తెలుగు తమ్ముళ్లు గళమెత్తారు. స్థానిక టిడిపి పట్టణ కమిటీని సంప్రదించకుండా ఏకపక్షంగా తీసుకుంటున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తూ స్థానిక 18వ వార్డులో సమావేశాన్ని నిర్వహిం చారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు సతివాడ రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రజాభిప్రాయాన్ని నాయకులు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో రాజేశ్వరరావు, వాగు రమేష్‌లు మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో టిడిపికి వ్యతిరేకంగా వైయస్సార్సీపి విజయానికి కృషిచేసిన వైసిపి నాయకులను అక్కున చేర్చుకుంటున్న సత్యప్రభ విధానాలు సరైనవి కావని దుయ్యబట్టారు. గత ఎన్నికల్లో టిడిపి విజయానికి కృషి చేసిన నిజమైన కార్యకర్తలను పక్కన పెట్టడం అవివేకమన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత టిడిపి తరఫున పనిచేసిన కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి కష్ట, నష్టాలకు గురైన నిజమైన టిడిపి కార్యకర్తలను గుర్తించకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో రాయడు చిన్న, బూడి సూరిబాబు, తుమ్మి విజయ్, ముచ్చి అప్పలరాజు, నిమ్మకాయల నారాయణ, వాగు రమేష్, రొట్ట వీరాజు,చింతల పాండవులు, పైల అయ్యప్ప, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ నేతల గృహ నిర్భంధాలు దారుణం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : బిజెపి నేతల గృహనిర్బంధాలు దారుణమని ఆ పార్టీ నాయకులు దుయ్యబట్టారు. విజయవాడలో జరిగే రైతు గర్జన సభకు బీజేపీ నాయకులను, జిల్లా కిసాన్ మోర్చ నాయకులను సభకు వెళ్లనివ్వకుండా పోలీసులు గృహనిర్బంధం చేయడంతో ఆ పార్టీ శ్రేణులు రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ ఇప్పటివరకు రైతులకు మిచాంగ్ తుఫాన్ నష్ట పరిహారం చెల్లించలేదని, డ్రిప్ ఇరిగేషన్‌కి రాష్ట్ర ప్రభుత్వ వాటా చెల్లించక కేంద్ర ప్రభుత్వ వాటా నిధులు వెనుకకు వెళ్లిపోతున్నాయని, ఫసలీ భీమా పథకంలో రైతులను రాష్ట్ర ప్రభుత్వం చేర్చకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని తెలిపారు. కాకినాడ జిల్లా నుండి రైతుల పక్షాన సమస్యలు విన్నవించడానికి విజయవాడ వెళ్తున్న కాకినాడ జిల్లా బీజేపీ అధ్యక్షులు చిలుకూరి రామ్ కుమార్‌ని, కాకినాడ జిల్లా కిసాన్ మోర్చఅధ్యక్షులు సింగిలి దేవి సత్తిరాజుని పోలీసులు గృహ నిర్బందించడం దారుణమని అన్నారు. ఈ అరెస్టులను తాము ఖండిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం రూరల్, పట్టణ అధ్యక్షులు కంద వీరాస్వామి, కూరాకుల రాజా, రెడ్డి లోవరాజు, జిల్లా కమిటీ సభ్యులు గట్టిం వెంకట రమణ, ఏనుగు ధర్మరాజు, ద్రాక్షారపు పోసిరావు, ఏలేశ్వరం పట్టణ ప్రచార కార్యదర్శి గొల్లపల్లి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి

విశాలాంధ్ర - కాత్రేనికోన : మండలంలోని గోపాలరావుపేటలో దీన్ దయ్యాల ఉపాధ్యాయ 56వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అంబేద్కర్ కోనసీమ జిల్లా భారతీయ జనతా పార్టీ ట్రెజరర్ గ్రంధి నానాజీ మాట్లాడుతూ ఏకాత్మ మానవవాదాన్ని ప్రవచించ అంత్యోదయ విధానాన్ని రూపొందించి ప్రపంచంలో అతిపెద్ద పార్టీగా అవతరించిన బిజెపికి పటిష్ట పునాదులు వేశారని పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండలబిజెపి అధ్యక్షులు మట్ట సూరిబాబు, జనరల్ సెక్రెటరీ కొడమంచిలి సురేష్, శంకర్, నాగేశ్వరరావు, కోటా సత్య ప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై సదస్సు

విశాలాంధ్ర- రాజమహేంద్రవరం రూరల్ : మంగళవారం తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, తూర్పు గోదావరి జిల్లా రోడ్డు రవాణా అధికారుల సమన్వయ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో "డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్లు జారీకి సంబంధించిన సమస్యల పరిష్కారం", "రోడ్డు ప్రమాదాల నివారణ" పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రత్యూష కుమారి మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్లు జారీ విష యంలో సంబంధిత అధికారులు పాటించవలసిన నిబంధనల గురించి వివరించారు. "మోటారు వాహనాల చట్టం, 1988" మరియు మోటారు వాహనాల సవరణ చట్టం, 2019" లోని వివిధ అంశాల పై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన అవసరమని, పరిమిత వేగంతో, భద్రత ప్రమాణాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు చాలా వరకు తగ్గించవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, వాహనాలు నడిపే సమయంలో నిర్లక్ష్యంగా ఉండరాదని అన్నారు. ఈ సదస్సులో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎన్. విలియం కేరీ, రాజమహేంద్రవరం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. బాల మురళీ కృష్ణ, మెప్మా కార్యకర్తలు, వార్డు వాలంటీర్లు, ఆటో డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల వద్ద లబ్దిదారుల పడిగాపులు

విశాలాంధ్ర - సీతానగరం: సచివాలయాల వద్ద లబ్ధిదారులు పడి గాపులు పడుతున్నారు. మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలలో గ్రామ సచివాలయాల వద్ద జగనన్న ఇళ్ళ స్థలాలు లబ్ధిదారులు గంటల తరబడి నిరీక్షించవలసి వస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేద ప్రజలకు ఇళ్ళ పట్టాల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయడం కోసం పంచాయితీ కార్యదర్శులకు ప్రత్యేక జి ఓ ద్వారా రిజిస్టర్ హోదా కల్పించారు. ఒక్కో గ్రామంలో సుమారు 300 నుండి 400 లబ్ధిదారులు ఉండడంతో సచివాలయాల వద్ద గంటల తరబడి లబ్ధిదారులు వేచి చూడాల్సిన పరిస్థితుల ఏర్పడుతున్నాయి. దీనికి తోడు కొన్ని చోట్ల ఇంటర్నెట్, పోర్టల్ సర్వీసులు అంతరాయాలు ఏర్పడడంతో రిస్ట్రేషన్ ప్రక్రియ మరింత ఆలస్యం అవుతుంది. దీనిపై లబ్ధిదారులు మహిళలు కావడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల లబ్ధిదారులకు కనీసం కూర్చోవడానికి కుర్చీలు కూడా లేవని ఆరోపిస్తున్నారు. దీనిపై ఉన్నత అధికారులు స్పందించి రిజిస్ట్రేషన్లు ప్రక్రియ వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

విదేశాలకు వెళ్లిన, మృతి చెందిన ఓటర్లను బిఎల్వోలు పారదర్శకంగా తొలగించాలి

విశాలాంధ్ర - గోపాలపురం : ఓటర్ లిస్టులో మృతి చెందిన వారు, విదేశాలకు వెళ్లిన వారి ఓట్లను పారదర్శకంగా తొలగించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ల్యాండ్ ఎక్విజేషన్, జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె. శివపార్వతి తెలిపారు . మంగళవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో బిఎల్ఓ లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలక్షన్ రెవెన్యూ అధికారి శివపార్వతి మాట్లాడుతూ బి ఎల్ ఓ లు ఫారం 6, ఫా రం7 ఫారం 8 ల గురించి ఓటర్ లకు అవగాహన కల్పించాలని, నిష్పక్షపాతంగా అనర్హత కలిగిన ఓ టర్లను తొలగించాలని, రాజకీయ ఒత్తిడి లను పట్టించుకోకూడదని, సమగ్ర సర్వే జరిపి పారదర్శకంగా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులను ఓటర్లగా నమోదు చేసుకోవాలని సూచించారు.

16న బంద్ జయప్రదం చేయండి

విశాలాంధ్ర-దేవరపల్లి: ఈనెల 16వ తేదీ జరుగుతున్న పారిశ్రామిక, గ్రామీణ బందును జయప్రదం చేయాలని వామపక్ష కార్మిక సంఘాలు పిలుపు నిచ్చాయి. దేవర పల్లిలో ఐఎఫ్టియు నాయకులు సిహెచ్ రమేష్ అధ్యక్షతన వామపక్ష కార్మిక సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఎస్.భగత్ మాట్లాడుతూ రైతుల పంటకు మద్దతు ధర కల్పించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం సమ్మె జరుగుతుందని తెలిపారు. రవాణా రంగంలో తీసుకొచ్చిన చట్టాలు రవాణా కార్మికుల పట్ల శాపంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనం 26,000గా నిర్ణయించి అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు ఆచంట సత్య నారాయణ, ప్రగతిశీల కార్మిక సంఘం నాయకులు ఎస్కే మస్తాన్, ఏఐఎఫ్టియు నాయకులు టీ పెంటయ్య, రైతు సంఘం నాయకులు ఉండవల్లి కృష్ణారావు, వ్యవసాయ కారం సంఘ నాయకులు కే రత్నాజీ, ఐ ఎఫ్ టి యు నాయకులు కే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కాకినాడ 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఐఎ నెం. 295/2022, ఐపి నెం.08/2019

బిట్వీన్:

గుంటుపల్లి బాబూరావు -పిటీషనరు

మరియు

కదలి విజయ & అదర్స్ - రెస్పాండెంట్లు

టు

ఆర్3) కూనే సుబ్బారావు, తండ్రి (లేటు) కొండలరావు, డోరు నెం. 70-17-32/6, ఆర్.టి.ఓ ఆఫీసు వద్ద, ఆర్.ఆర్.నగర్, కాకినాడ, కాకినాడ జిల్లా.

ప్రకటన

పై నెంబరు కేసులో మీ హాజరు నిమిత్తం పైన తెలిపిన కోర్టులో ది.22-02-2024 తేదీ నాటికి వాయిదా ఉన్నది. సదరు వాయిదా రోజున ఉదయం 10-30 గం॥లకు మీరు స్వయంగా గాని మీ తరుపున ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి, మీ తరుపున ఆక్షేపణలు ఏమైన ఉన్న యెడల నదరు తీర్పు మీ వరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

శ్రీ రాచకొండ వెంకట సుబ్రహ్మణ్యం
పిటీషనరు తరుపున న్యాయవాది,కాకినాడ.
సెల్ నెం:9848229704

విశాలాంధ్ర
గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

16న దేశవ్యాప్త బంద్ గోడపత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ, అంబెడ్కర్ స్క్వేర్ : రైతుల పంటలకు గిట్టుబాటు ధర చట్టాన్ని చేయాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికులకైనా కనీస వేతనం రూ. 26,000 చెల్లించాలని, కౌలు రైతులకు పంట రుణాలు, పంట నష్టం, ఇన్సూరెన్స్ సౌకర్యం భూయజమానితో సంబంధం లేకుండా కల్పించాలని, ఉపాధి పథకాన్ని 200 రోజులకు పెంచి, రోజు వేతనం 600 చెల్లించాలని, ట్రాన్స్ పోర్ట్ కార్మికుల మెడపై పెట్టిన కత్తి హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను కొనసాగించాలని కోరుతూ ఫిబ్రవరి 16వ తారీఖున గ్రామీణ బంద్, ట్రాన్స్ పోర్ట్ సమ్మె, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో గోడ పత్రికను అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఐఎఫ్టీయూసీ ఏపీ తెలంగాణ ఆర్గనైజింగ్ సెక్రటరీ తాళ్లూరి రాజు, సిఐటియు జిల్లా కోశాధికారి మలకా రమణ, రామయ్య, ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్ స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నిట్ల శ్రీను, రొంగుల ఈశ్వరరావు, సిఐటియు నగర అధ్యక్షులు పలివెల వీరబాబు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ళ పద్మ, పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ మేడిశెట్టి వెంకటరమణ, సిఐటియు వర్కింగ్ కమిటీ సభ్యులు గడిగట్ల సత్తిబాబు, కరణం విశ్వనాథం, కాటంరాజు, టి.రాజా, దివిలి నాగు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన

విశాలాంధ్ర - రాజానగరం : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిపేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని బొమ్మూరు సిఐ ఎండీ ఉమర్ అన్నారు. రాజకీయ పార్టీ నాయకులు, ప్రజాసంఘాలు, ఆటో యూనియన్ నాయకులతో పాటు స్థానిక ప్రజలకు ఎన్నికల నియమావళి పై మండలంలోని దివాన్ చెరువు గ్రామంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ ఎండీ ఉమర్ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఏ ఒక్కరు ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. సామాజిక మాధ్యమాలను వేదిక చేసుకొని ఒకరి పై మరొకరు వ్యక్తిగతంగా, రాజకీయంగా విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే వారి పై చట్టపరమైన కఠిన శిక్షలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరు ఎన్నికల కమిషన్ ఆదేశాలకు కట్టుబడి పని చేయాలని చెప్పారు. ఈ సమావేశం లో శ్రీ లక్ష్మి గణపతి ఆటో యూనియన్ అధ్యక్షులు దాసరి శ్రీనివాస్, టిడిపి బీసీ సాధికార కమిటీ రాష్ట్ర డైరెక్టర్ వంక మల్లిఖార్జున స్వామి(మల్లిబాబు), ఎస్సి సెల్ జిల్లా కార్యదర్శి ఖండవిల్లి లక్ష్మి,జనసేన నాయకులు యర్రంశెట్టి శ్రీనివాస్, వైసీపీ నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు,మార్గానీ శ్రీను,వివిధ పార్టీల నాయకులు,కార్యకర్తలు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సిఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ మృతి

విశాలాంధ్ర - చాగల్లు : చాగల్లు మండలం మల్లవరం గ్రామానికి చెందిన సిఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ జలాధి శ్రీనేష్ కొవ్వూరు పాత టోల్గేట్ మలుపు వద్ద మంగళవారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. రాజమండ్రి నుండి తన సొంత ద్విచక్ర వాహనం పల్సర్ పై ఇంటికి వస్తుండగా అదుపు తప్పి రైలింగ్ గుద్ది ద్విచక్ర వాహనం పై నుండి పడి పోగా తలకు బలమైన గాయమై సంఘటనా స్థలంలోనే శ్రీనివాస్ మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉండగా భార్య ప్రస్తుతం గర్భవతి. తమ సమీప బంధువు ఇటీవల కాలం చేయడంతో పలకరింపు కోసం వచ్చిన ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసిన కొవ్వూరు పట్టణ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వేమనకు నివాళులు

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామంలో యోగి వేమన అభ్యుదయ సంఘం వారి ఆధ్వర్యంలో అధ్యక్షులు కూచిపూడి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వేమన విగ్రహానికి దేవరపల్లి మండలం మానవత చైర్మన్ బలుసు సత్యనారాయణ పూలమాల వేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా కవి, సంఘసంస్కర్త యోగి వేమన పద్యం వినని తెలుగువారు ఉండరని అన్నారు. వేమనను ఆదర్శంగా తీసుకుని వివాహాలు చేసుకున్న ఉండవల్లి కృష్ణారావు ,ప్రభావతి దంపతులను, కొత్తగుండి రత్నాజీ దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా ఉండవల్లి కృష్ణారావు మాట్లాడుతూ మంత్రాలు, తంత్రాలు లేకుండా రెండు కాగితాలు రాసుకుని దండలు మార్చుకుని వివాహం చేసుకున్నామని తెలిపారు. అనంతరం వేమన సంఘం కూచిపూడి సత్యనారాయణ సన్మానించారు. .ఈ కార్యక్రమంలో మండల మానవత ఉపాధ్యక్షులు ఆచంట సుభాష్ చంద్రబోస్, అడ్వకేట్ కేవీవీ సత్యనారాయణ, నల్లమాటి రామారావు, జలజాక్షి, కూచిపూడి హనుమంతరావు, మహిళా మండల సభ్యులు, గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

తానేటి వనిత ఎన్నికల ప్రచారం ప్రారంభం

విశాలాంధ్ర-దేవరపల్లి: రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. దేవరపల్లి మండలం గౌరీపట్నంలో మంగళవారం కనకదుర్గమ్మ తల్లి మేరీమాత ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనిత పల్లంట్ల, కురుకూరు, దుమంతునిగూడెం, కృష్ణం పాలెం, బంధపురం గ్రామాలలో పర్యటించి పార్టీ నేతలను కార్యకర్తలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో ప్రత్యేక సమావేశాలు జరిపి పార్టీ నేతలు, కార్యకర్తలతో రాబోవు అసెంబ్లీ లోక్సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామ సమస్యలపై పార్టీ నేతలు, కార్యకర్తలు మంత్రి తానేటి వనితకు అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో దేవరపల్లి మండల వైసీపీ అధ్యక్షుడు కూచిపూడి సతీష్, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్ధన రావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, పార్టీ నేతలు రాజేంద్ర బాబు, గూడూరి రాధిక, గడ జగదీష్, గడ రాంబాబు, సాది సుబ్బారావు, నూతలపాటి వెంకటరమణ, రాయుడు, వెంకట్రావు, సత్తి జగదీశ్వర్ రెడ్డి, సత్తి సాయి ఈశ్వర్ రెడ్డి, గారపాటి రమాప్రభ, కరుటూరి నిత్యానందం, ఆచంట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చేసిన అభివృద్ధి చెప్పాలి

విశాలాంధ్ర - కరప : చేసిన అభివృద్ధి చెప్పక తప్పదని కాకినాడ రూరల్ శాసనసభ్యులు కురసాల కన్నబాబు పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం పెంకె శ్రీలక్ష్మి సత్తిబాబు అధ్యక్షతన జరగగా ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కన్న బాబు ముఖ్యఅతిథిగా హాజరై వివిధ అభివృద్ధి పనులపై ప్రసంగించారు. వ్యవసాయ మంత్రిగా పని చేసి రైతులకు ఇన్పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, పంటల బీమా వంటి రుణాలు అందించామన్నారు. కరప మండలంలో తాగునీటి వసతులు కల్పించి ప్రజల దాహార్తి తీర్చామని తెలిపారు. వివిధ శాఖల పనితీరుపై సంతృప్తిని వ్యక్తం చేసి ప్రజలకు అందుబాటులో అధికారులు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వై.సుబ్బారావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాంతం, నడిపూడి ఓపెన్ ఇసుక ర్యాంపులు పరిశీలించిన కలెక్టరు

విశాలాంధ్ర-భీమవరం: పెనుగొండ మండలం సిద్ధాంతంలో రెండు, నడిపూడిలో రెండు ఇసుక ర్యాంప్ లను సెబ్ అడిషనల్ ఎస్పీ ఏటివి రవికుమార్, ఆర్డీవో యం.అచ్యుత అంబరీష్, సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి మంగళవారం పరిశీలించారు. ఆచంట మండలం కోడేరు, కరుగోరుమిల్లి గ్రామాల్లో రెండు ఇసుక ర్యాంపులను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ రెండు మండలాలలో ఆరు ఇసుక త్రవ్వకాలు పున: ప్రారంభించుటకు పర్యావరణ అనుమతుల కోసం దరఖాస్తు చేసినట్టు తెలిపారు. ఇసుకు అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణా జరుగుతున్నాయో లేదో అని క్షుణ్ణంగా పరిశీలించినట్టు ఆమె తెలిపారు. అక్రమ తవ్వకాలు జరిపేందుకు ఎటువంటి మిషనరీలు, యంత్రాలు లేవని స్వయంగా పరిశీలించడం జరిగిందని ఆమె వెల్లడించారు. ఈ ర్యాంప్‌ల వద్ద ఎటువంటి రవాణా, త్రవ్వకాలు జరగకుండా చూడాలని కట్టు దిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. జిల్లా కలెక్టరు వెంట ఎఎస్పి ఏటివి కుమార్, ఆర్డీవో యం.అచ్యుత అంబరీష్, జలవనరుల శాఖ యస్ఇ శ్యామ్ ప్రసాదు, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ కె.వెంకటేశ్వరరావు, గోదావరి రివర్ కన్సర్వేటరు , ఇఇ ఆర్.కాశీ విశ్వేశ్వరరావు, ఇన్చార్జి తహాశీల్దార్లు వి.అన్నపూర్ణ, డి .సుగుణ సంధ్య, నీటిపారుదల, మైన్స్, కాలుష్య నియంత్రణ, రెవిన్యూ, పోలీసు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం ప్రారంభం

విశాలాంధ్ర-ఆచంట: మాజీ మంత్రి, జిల్లా పార్టీ అధ్యక్షులు ఆచంట నియోజకవర్గ శాసనసభ్యులు చెరుకువాడ శ్రీరంగ నాథ రాజు ఆధ్వర్యంలో బాలంవారి పాలెం గ్రామ సచివాలయం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, కొత్తపేట నియోజకవర్గ శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి , శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ ముఖ్య అతిధులుగా విచ్చేసారు. ఈ కార్యక్రమంలో ఆచంట గ్రామ సర్పంచ్ కోటసరోజినీ వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ అద్దాల పెద్దిరాజు, ఎంపీటీసీ బొక్క లీల సుబ్రహ్మణ్యం, వైసిపి ఆచంట గ్రామ అధ్యక్షులు పెచ్చేటి సత్యనారాయణ ,వార్డ్ మెంబర్లు, నాయకులు కార్యకర్తలు, ప్రజలు , ఈ వో పి ఆర్ డి మూర్తిబాబు, ఆచంట పంచాయతీ కార్యదర్శి నాగబాబు ,సచివాలయం సిబ్బంది, వాలంటీర్స్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - కైకలూరు : పొదుపు సంఘాల మహిళలకు హామీ ఇచ్చి ఆసరా పథకం నాలుగు విడతల్లో చెల్లిస్తామని చెప్పి సంపూర్ణంగా అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందని కైకలూరు శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు పేర్కొన్నారు. కైకలూరులోని వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్‌లో జరిగిన 4వ విడత వైఎస్సార్ ఆసరా విడుదల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు, శాసన మండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ కలసి పాల్గొని ముందుగా జ్యోతి ప్రకాశనం చేసి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం 4వ విడతగా 1391 మంది లబ్ధిదారులకు 11.25 కోట్ల రూపాయల చెక్కును విడుదల చేసి పొదుపు సంఘాల అక్క చెల్లెమ్మలు నాయకులతో కలసి ముఖ్య మంత్రి చిత్ర పటమునకు కృతజ్ఞతగా పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అడవి వెంకట కృష్ణ మోహన్, జడ్పీటీసీ కూరెళ్ల బేబీ, ఏఎంసి చైర్మన్ చేబోయిన వీర్రాజు, సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి, పొదుపు సంఘాల మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

విశాలాంధ్ర- ఉంగుటూరు : రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థకు పెద్దపీట వేస్తుందని అక్కుపల్లి గోకవరం గ్రామ సర్పంచి మిద్దె సత్యవతి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఉంగుటూరు మండలం అక్కుపల్లి గోకవరం యూపీ పాఠశాలలో 30మంది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్ లను సర్పంచ్ అందజేశారు. వినయ విధేయతలతో పాటు క్రమ శిక్షణతో ఉన్న విద్యార్థి కరుటూరి రాజు కిరణ్‌ను అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు టి.ఆనందరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ముందడుగులు వేస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు దేవదాసు విజయనిర్మల, కరుటూరి చిన్న రాజా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంబేద్కర్ స్టడీ సెంటర్ ప్రారంభం

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : భారతదేశంలో నివసిస్తున్న బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తన సర్వస్వాన్ని ధారపోసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని పలువురు వక్తలు తెలిపారు. మంగళవారం భీమవరం చిన్న పేట లోని రాజ్యాంగ నిర్మాత ప్రపంచ మేధావి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని, గొంతెనమ్మ గుడి ప్రాంగణంలో అంబేద్కర్ స్టడీ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి గా నిలిచిన నాయకుడని అన్నారు. కొత్తపల్లి విక్టర్ బాబు, నాయకులు గంటా సుందర్ కుమార్, ఏలేటి న్యూటన్, కోన జోసెఫ్ తదితరులు ప్రసంగించారు. అనంతరం వృద్ధులకు, పేద మహిళలకు,చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జక్రి, చిగురుపాటి రాజు, కొత్తపల్లి విక్టర్ బాబువీట జేమ్స్ నాయకులు , ఈది రవికుమార్, పిల్లి ముసలయ్య, గుంటి ప్రభు, కొనాల బన్ను, ఈది రాజశేఖర్, తాళ్లూరి రాజ్ కుమార్, చినపేట అంబేద్కర్ యూత్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ శ్రేణులు

విశాలాంధ్ర -భీమవరం: జగన్ ప్రభుత్వ అరాచక అవినీతి పాలనను చూసి ప్రజలతోపాటు వైసీపీ నాయకులు అసహ్యించుకుంటూ టిడిపిలో చేరు తున్నారని భీమవరం నియోజక వర్గంలో అభివృద్ధి శూన్యమని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. వీరవాసరం మండల కమిటీ ఆధ్వర్యంలో వీరవాసరం మండలంలోని 50 వైసీపీ కుటుంబాలు మంగళవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ తెదేపా, జనసేన ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు పెట్టడానికే వైసిపికి సమయం సరిపోయిందని త్వరలో రానున్నది తెదేపా జనసేనల ప్రభుత్వమన్నారు. టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ ఎన్నికలకు సిద్ధమని సమావేశాలు పెడుతున్న జగన్ కి అభ్యర్థులు కరువయ్యారని జగన్ని ఇంటికి పంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, వీరవాసరం ఎంపీపీ వీరవల్లి దుర్గభవాని, మాజీ ఎంపీటీసీ రెడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధే లక్ష్యం

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : మండలాన్ని అభివృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యమని కొయ్యలగూడెం మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు గంజిమల రామారావు పేర్కొన్నారు. మండలంలోని కన్నాపురం గ్రామంలో 7,50,000 లక్షల రూపాయల విలువ గల మండల పరిషత్ నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సిసి రహదారులకు రామారావు భూమి పూజ చేసి పనులు ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ మండలంలో ఉన్న అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తామని, ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ ఉప్పల పద్మ, ఎంపీటీసీ సభ్యులు, వార్డ్ మెంబర్లు, వైఎస్ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆసరా నిధుల పంపిణీ

విశాలాంధ్ర - లింగపాలెం : లింగపాలెం మండలంలో నాల్గవ విడతగా ప్రభుత్వం మంజూరు చేసిన వైఎస్సార్ ఆసరా పథకంలో రూ. 13.78 కోట్లు మంగళవారం చెక్కులు పంపిణీ చేశారు. మండలంలో నాలుగు విడతలుగా రూ. 55.12 కోట్లును 1308 మహిళా సంఘాలలో ఉన్న 13 వేల 96 మంది సభ్యులకు అందించినట్టు వెలుగు పథకం అధికారులు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఆసరా పంపిణీ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. కార్యక్రమంలో వెలుగు పథకం అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, స్థానిక నాయకులు, మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఆసరా పథకంపై పలువురు వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జానకీరెడ్డి, వెలుగు పథకం ఎపీ రామోజీ, ఏపీఎం కమల, వెలుగు సంఘ మండల నాయకురాళ్ళు పాల్గొన్నారు. ఆసరా నిధులు పంపిణీ కార్యక్రమంలో వైసీపీ ఏలూరు పార్లమెంటు సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభంపాటి విజయరాజు ముఖ్య అతిథులుగా పాల్గొని పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా వీరు వైసీపీ నుంచి పోటీ చేస్తున్న తమను ఎంపీగా, ఎమ్మెల్యేగా గెలిపించా లని కోరారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మహిళలు రావటంతో వీరికి తగిన వసతులు లేక ఇబ్బందులు పడ్డారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఎలీజా హాజరవుతారని వెలుగు సిబ్బంది ప్రచారం చేశారు. ఈయన రాకపోవటంతో చర్చనీయాంశమైంది. దీనిపై పలువురు చర్చించుకున్నారు.

జిల్లా టీడీపీ వాణిజ్య విభాగం కార్యదర్శిగా అడుసుమిల్లి రాము

విశాలాంధ్ర-ముదినేపల్లి : ఏలూరు జిల్లా టిడిపి వాణిజ్య విభాగం కార్యదర్శిగా ముదినేపల్లి మండలం గురజ గ్రామానికి చెందిన అడుసుమిల్లి రామకృష్ణ (రాము) కు ఈ విభాగం జిల్లా అధ్యక్షులు కేకే బాబు నుండి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు ఆటపాక టిడిపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర విభాగ ఉపాధ్యక్షులు చలసాని జగన్మోహనరావు, నాయకులు పెనుమత్స వెంకటశ్వరాజు , చల్లగుళ్ళ శోభనాద్రి చౌదరి , పెనుమత్స త్రినాధరాజు , వీరబత్తిన సుధ , తదితరులు పాల్గొని అభినందించారు.

గోవిందరాజులు మృతి వైసీపీకి తీరనిలోటు

విశాలాంధ్ర - ముదినేపల్లి : వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకుడు , మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, మాజీ సర్పంచ్ కరేటి గోవింద రాజులు అకస్మిక మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని బొమ్మినంపాడు సర్పంచ్‌గా పనిచేసిన గోవిందరాజులు వైసిపిలో క్రియాశీలకంగా పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. నియోజక వర్గంలో బీసీ నాయకుడిగా సుపరిచితుడు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా విద్యాభివృద్ధికి కృషి చేశారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గా రైతులకు విశేష సేవలందించారు. ఇతనికి భార్య , ఇద్దరుకుమారులు ఉన్నారు. ఎమ్మెల్యే డిఎన్ఆర్ తోపాటు ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ , హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, డిఎన్ఆర్ తనయులు వినయ్ కుమార్, శ్యామ్ కుమార్ , వైస్ ఎంపీపీలు చొపర్ల సునీత, రాచూరి రాధ, వైసిపి నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు.

జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన మాంటిస్సోరి స్కూల్ పూర్వ విద్యార్థులు

విశాలాంధ్ర-తణుకు : స్థానిక మాంటిసోరి స్కూలులో పదవ తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థిని విద్యార్థులు 2024 జే ఈ ఈ మెయిన్స్ నందు ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాష్ రావు ఉత్తమ ర్యాంకులు సాధించిన డి సోహన్ మహేంద్ర, ఎస్ సుప్రియ, జై మణికంఠ నిర్దేష్, డి భాను శ్రీ లలిత విద్యార్థిని విద్యార్థులను అభినందించారు. ఇంతటి ఘనవిజయాన్ని సాధించిన విద్యార్థులను అభినందిస్తూ ఇకముందు కూడా మాంటిస్సోరి విద్యార్థులు ఉత్తమ ర్యాంకర్లుగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థి విద్యార్థులను అభినందిస్తూ వారికి అభినందనలు తెలియజేశారు.

ప్రసాదరాజు మోసాల రాజు

విశాలాంధ్ర-మొగల్తూరు:ప్రభుత్వం దృష్టిలో ఛీప్ విప్ ప్రసాదరాజు అని, జిల్లా కేంద్రం, మెడికల్ కాలేజీ తరలించి, రూ 3,200 కోట్ల అభివృద్ధి అంటూ మోసం చేస్తూ, అబద్ధాలు చెప్పే ఎమ్మెల్యే ను మోసాల ప్రసాదరాజు అని ప్రజలు పిలుస్తున్నారని నరసాపురం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు అన్నారు. మండలంలో టీడీపీ హయాంలో శంకుస్థాపన చేసిన కొత్తపాలెం వంతెన, మొగల్తూరు వెంప రోడ్డు ను మంగళవారం మాజీ ఎమ్మెల్యే బండారు పరిశీలించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పేరుతో శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే ప్రసాదరాజు ప్రజలను మోసం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు అన్నారు. 2018లో కొత్తపాలెం బేతపూడి వంతెన, మొగల్తూరు వెంప రోడ్డు పరిస్థితులను అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిలో పెట్టి కొత్తపాలెం- కంసాలి బేతపూడిని అనుసంధానం చేస్తూ గొంతేరు డ్రైయిన్ పై వంతెన నిర్మాణానికి రూ .16.50కోట్లు, మొగల్తూరు వెంప రహదారి కి సి ఆర్ ఎఫ్ ఫండ్స్ రూ.12.64 కోట్లు కేటాయించి అప్పటి పంచాయతీరాజ్ మంత్రి లోకేష్ తో 2018 లో శంకుస్థాపన చేయించి, పనులు చేపట్టామని మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు తెలిపారు.

ఎస్‌బిఐని అభివృద్ధి చేస్తే గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం

విశాలాంధ్ర - గణపవరం: భారతీయ స్టేట్ బ్యాంకు పిప్పర శాఖను ప్రజలు అభివృద్ధి చేస్తే, బ్యాంకు గ్రామాన్ని అభివృద్ధి చేస్తుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ సిహెచ్ రంగాచార్యులు అన్నారు. మంగళవారం గణపవరం మండలం పిప్పర గ్రామంలో ఎస్ బి ఐ పిప్పర బ్రాంచ్ వద్ద అంగన్వాడీ కేంద్రం వద్ద సమావేశం నిర్వహించారు. గ్రామంలో ఉన్న సొంత భవనం కలిగిన అంగన్వాడికి ఎస్ బి ఐ బ్యాంకు సి ఎస్ ఆర్ యాక్టివిటీస్ కింద లక్ష రూపాయలు వేయింతో టీవీ, వాటర్ ప్యూర్ ఫిల్టర్, ట్యాబ్ లతోపాటు అంగనవాడి భవనానికి రంగులు వేయించారు. అంగన్వాడి కేంద్రానికి సామాగ్రిని రీజినల్ మేనేజర్ రంగాచార్యులు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ జి రాజు, హెచ్ ఆర్ మేనేజర్ సిహెచ్ శ్రీనివాస్, పిప్పర బ్రాంచ్ మేనేజర్ కె ప్రవీణ్ కుమార్,పిఓ పోలేశ్వరరావు, వైస్ ఎంపీపీ వీరమ్మ, ఇందుకూరు వెంకట నరసింహారాజు(ఐ వి రాజు) ఐసిడిఎస్ సూపర్వైజర్ సిహెచ్ దుర్గ భవాని అంగన్వాడీ కార్యకర్త బొంత అనిత తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణాలలో భద్రతే ప్రాణాలకు భరోసా

విశాలాంధ్ర-పెనుగొండ: స్థానిక ఎస్వికెపి డాక్టర్ కేఎస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్, రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ మాసోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు.. ప్రిన్సిపాల్ డాక్టర్ వైవివి అప్పారావు అధ్యక్షత వహించి ప్రారంభ ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణాలలో అధిక స్పీడు, అవగాహన లేని వాహన డ్రైవింగు లాంటివి ఉండకూడదని, సెల్ ఫోన్లు వాహనాన్ని నడుపుతున్నప్పుడు ఉపయోగించ కూడదని, జాగ్రత్తలు పాటించాలని విద్యార్థిని విద్యార్థులకు సూచించారు . విద్యార్థులంతా సురక్షిత ప్రయాణం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సీనియర్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వై. సంజీవ్ కుమార్ మాట్లాడుతూ 35 సంవత్సరాలుగా రోడ్ సేఫ్టీ మాసోత్సవాలు జరుపుకుంటున్నామని ప్రతి ఒక్కరూ వారి వారి ప్రయాణాలలో జాగ్రత్తలు పాటించినట్లయితే ఇట్లాంటి మాస ఉత్సవాలు జరుపుకొన క్కరలేదని విద్యార్థిని విద్యార్థులంతా ప్రయాణ సమయాలలో బహు జాగ్రత్తగా ప్రయాణం చేయాలని సూచించారు. ఈ సదస్సులో మోహన్ డ్రైవింగ్ స్కూల్ డైరెక్టర్ కంబాల మోహన్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులంతా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ స్కిల్స్ నేర్చుకుని డ్రైవ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు టి.దివాకర్ ,ఆర్ఎన్. శ్రీనివాస్ పి. మీరయ్య, మహేష్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో వంశీకృష్ణకు 99 పర్సంటైల్

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఏలూరు జిల్లా భీమడోలు గ్రామానికి చెందిన కే వంశీకృష్ణ జేఈఈ లో 99.8081085 శాతం సాధించి టాపర్ గా నిలిచారు. భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి కె. వంశీకృష్ణ మంగళవారం వెలువడిన జె.ఇ.ఇ. మెయిన్ పరీక్షల్లో 99.8081085 పర్సంటైల్ సాధించి పాఠశాల గౌరవాన్ని పెంచారని పాఠశాల కరస్పాండెంట్ యలమర్తి రవీంద్ర కుమార్ తెలిపారు. వంశీకృష్ణ తల్లితండ్రులు లైబ్రరియన్ కె శ్రీనివాస్, తల్లి పోలసానిపల్లి ఉపాధ్యాయ రాలుగా కె. తులసి గా పనిచేస్తున్నారు. పరీక్షలలో అత్యధిక పర్సంటైల్ సాధించిన వంశీకృష్ణను పాఠశాల యాజమాన్యంతో పాటు,అధికారులు, ప్రజా ప్రతినిధులు అభినందించారు.

నేడు ఉభయ గోదావరి జిల్లాల కాంగ్రెస్ సమావేశం

విశాలాంధ్ర-పెరవలి : ఉభయగోదావరి జిల్లాల కాంగ్రెస్ పార్టీ నాయకుల సమీక్ష సమావేశం రాజమండ్రి పేపర్ మిల్ గేటు వద్ద గల శ్రీసాయి కళ్యాణ మండపంలోబుధవారం నిర్వహించనున్నట్టు తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు అరిగెల అరుణ కుమారి మంగళవారం విలేఖరులకు తెలిపారు. ఈసమావేశానికి ముఖ్య అతిథులుగా పార్లమెంటు సభ్యులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్చార్జి మాణిక్యంఠాగూర్, కొప్పుల రాజు, ఏఐసీసీ సెక్రెటరీ మయ్యప్పన్, సిడబ్ల్యూసి సభ్యులు గిడుగు రుద్రరాజు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వహక అధ్యక్షురాలు ఉభయగోదావరి జిల్లాల పర్యవేక్షకులు సుంకర పద్మశ్రీ విచ్చేయనున్నట్టు తెలిపారు. జిల్లాలో ఉన్న నగర, పట్టణ, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు, యూత్ కాంగ్రెస్ ఎన్ ఎస్ యు.ఐ మహిళా విభాగం ఎస్సీ విభాగం, కిసాన్ విభాగం, అసంఘటిత కార్మికుల విభాగం, వివిధ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థల అధ్యక్షులు హాజరు కావాలని ఆమె పిలుపునిచ్చారు.

పేదలందరికీ కార్పొరేట్ వైద్యం

విశాలాంధ్ర- తాళ్ళపూడి : ప్రజలందరి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉండాలనే ఆలోచనతో పేదలందరికి కార్పొరేట్ వైద్యం అందించాలని జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రెండవ సారి కూడా అమలు చేస్తున్నామని మండల వైకాపా అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు తెలిపారు. పోచవరం సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం రోగులకు ఉచితంగా అందించే కిట్లను పంపిణీ చేశారు. స్థానిక వైకాపా నాయకులు, సొసైటీ అధ్యక్షులు మద్దుకురి దొర బాబు, తదితరులు పాల్గొన్నారు. జనరల్ విభగ విభాగలతో పాటు వివిధ ప్రత్యేక విభాగాలు ఈ.ఎం.టి, ఆర్థో, ఈ.సి.జి లతో సహా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్య క్రమానికి డా.హారిక గుప్తా, డా.భవాని, బి.సాయి శ్రీనివాస్, కె.వి బాల సుబ్రహ్మణ్యం వైద్య సేవలు అందించారు.

గాన కోకిల సరోజిని నాయుడు జయంతి

విశాలాంధ్ర - తాళ్ళపూడి : రాగోలపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం భారత గాన కోకిల నైటింగేల్ ఆఫ్ ఇండియా సరోజిని నాయుడు జయంతి నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు దున్న దుర్గారావు, విద్యార్థులు సరోజిని చిత్ర పటం వద్ద ఆమెకు నివాళు లర్పించారు. ప్రధానోపాధ్యాయుడు దున్నా దుర్గారావు ఆమె జీవిత విశేషాలను, గొప్ప తనాన్ని విద్యార్థులకు వివరించారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చూపిన ఏలేశ్వరం విద్యార్థి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన జేఈఈ మెయిన్స్ ప్రవేశ పరీక్షలో ఏలేశ్వరం విద్యార్థి విశేష ప్రతిభ కనబరిచాడు. ఏలేశ్వరంకు చెందిన ప్రగళ్ళపాటి కామేష్, అనురాధల కుమారుడు ప్రగళ్లపాటి సాయి మోహిత్ ఆల్ ఇండియా స్థాయిలో 99.99 మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశాడు. ముంబై ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదవడమే తమ కుమారుడి లక్ష్యమని కామేష్ తెలిపారు. మోహిత్ చిన్న తనం నుండి విద్యలో ముందుండే వాడని, దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులతో పోటీపడి జేఈఈలో ప్రతిభ కనపరచడం హర్షనీయమని స్నేహితులు, కుటుంబసభ్యులు, బంధువులు అభినందించారు.

కార్తికేయ హాస్పిటల్ ఉచిత మెగా వైద్య శిబిరం



విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం నీలాద్రి రావు పేట గ్రామ సమీపంలో జగ్గంపేట శివారు కార్తికేయ హాస్పిటల్ వారిచే సీఈవో కూళ్ల వెంకటరమణ ఆధ్వర్యంలో డాక్టర్ కూళ్ల అవినాష్ అధ్యక్షతన ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ మెగా క్యాంపులో ఉచిత ఓపి, బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేసి, స్త్రీ మరియు ప్రసూతి విభాగము, జనరల్ మెడిసిన్, థైరాయిడ్, జ్వరం, డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా, కిడ్నీ, లివర్, ఎముకలు, కీళ్ళ వైద్య విభాగం, గుండె నరాల బలహీనత సంబంధిత వ్యాధులకు ఈ వైద్య శిబిరం నందు రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట నియోజకవర్గంలో వివిధ గ్రామాల నుంచి సుమారు 200 మంది ప్రజలు వచ్చి పరీక్షలు చేయించుకుని, ఉచితంగా మందులు తీసుకుని ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఉచిత మెడికల్ క్యాంపు పెట్టి, ఉచితంగా పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చిన ఆసుపత్రి యాజమాన్యానికి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆశా రమ్య, డాక్టర్ శరత్ రెడ్డి, హాస్పిటల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో శ్రీ వాగ్దేవి విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - అమలాపురం : పవర్ కిక్ షోటోకాన్ కరాటే దు అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అమలాపురం, దుడ్డువారి అగ్రహారం, షాదీఖానా ఫంక్షన్ హాలులో నాల్గవ ఏపి స్టేట్ ఇన్విటేషనల్ కరాటే ఛాంపియన్ షిప్-2024 అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించారు. ఈ పోటీలలో వివిధ పాఠశాలల నుండి సుమారు వెయ్యిమందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో పాల్గొన్న మొదటి సంవత్సరమే మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించి, 23 మంది బంగారు పతకాలను, 12 మంది రజత పతకాలను, మరో ఇద్దరు కాంస్య పతకాలను మెట్ల రమణబాబు చేతుల మీదుగా తీసుకొని, వాగ్దేవి పాఠశాల పేరు ప్రఖ్యాతలను దశదిశలా వ్యాపింపజేశారు. పిల్లలకు ఇచ్చిన ప్రోత్సాహాన్ని, విద్యార్థులు కనబరచిన ప్రతిభను గుర్తించి, అసోసియేషన్వారు పాఠశాలకు రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానాన్ని ప్రకటించారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పరచిన సమావేశంలో చక్కటి ప్రతిభను కనబరచి మంచి ఫలితాలను సాధించిన విద్యార్థులను డైరెక్టర్ పరసా భరత్గారు అభినందించి, పిల్లలకు శిక్షణను ఇచ్చిన డి సాయిబాబుని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా శ్రీరామచంద్రమూర్తి, ప్రధానోపాధ్యాయులు పి సుబ్రహ్మణ్యం మరియు తోటి ఉపాధ్యాయులు పాల్గొని బహుమతులను పొందిన విద్యార్థులను అభినందించారు.

పశు వైద్య శిబిరం

విశాలాంధ్ర- నిడదవోలు : రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు అధ్యక్షులు కీర్తి ఆంజనేయులు ఆధ్వర్యంలో తాళ్లపాలెం, సింగవరం, శెట్టిపేట గ్రామాల పాడి రైతుల ప్రయోజనం కొరకు, గోపవరం ప్యూపిల్స్ ట్రీ ,ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ వ్యవస్థాపకులు ఉప్పులూరి నరేష్ ఆర్థిక సహకారంతో తాళ్లపాలెం రైతు భరోసా కేంద్రం వద్ద ఉచిత మెగా పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ యర్రా రామకృష్ణ ప్రారంభించగా కొవ్వూరు పశు వైద్య సంవర్థ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.రాధాకృష్ణ, నిడదవోలు పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ వీ. ఋషి ప్రసాద్, డాక్టర్ ఎన్. మోహన్ రావు 171 పాడిపశువులకు వైద్యసేవలు అందించారు.ఈ పశువైద్య శిబిరంలో గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలు, నట్టల నివారణ మందులు,గర్భకోశ వ్యాధుల నివారణకు మందులు పంపిణీ చేసి పశు ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన సలహాలను పాడిరైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు అధ్యక్షులు కీర్తి ఆంజనేయులు అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివాసరావు, యామన గోపాల కృష్ణ కాళ్ళ రాంబాబు, గోన్నాబత్తుల రామారావు, గోపిరెడ్డి శ్రీనివాస్, గుంటుపల్లి శివ కుమర్,పొన్నా సుబ్రహ్మణ్యం,ఉప సర్పంచ్ గంధం నారయ్య రైతులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు అన్నారు. ప్రత్తిపాడు లయన్స్ క్లబ్‌లో మంగళవారం వలంటీర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ ప్రజల చెంతకు పాలన తీసుకువెళ్లడమే లక్ష్యంగా ప్రభుత్వం గ్రామ వలంటీర్, సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీని మరింత బలోపేతం చెయ్యాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతిసుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి దొరబాబు, లింగంపర్తి సొసైటీ చైర్మన్ వరుపుల సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి నాని, ఎంపీడీవో డేవిడ్ రాజ్, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కన్వీనర్‌లు, గ్రామ వాలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనం కోసం జనసేన

విశాలాంధ్ర - జగ్గంపేట : ఇంటికి దూరంగా ప్రజలకు దగ్గరగా జనం కోసం జనసేన కార్యక్రమం 798వ రోజు మంగళవారం మండలంలోని కాట్రావులపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జి పాటంశెట్టి సూర్య చంద్ర, శ్రీదేవి ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి చేయాలని కోరారు. జనసేన పార్టీ గెలిచిన తర్వాత నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, ఆదర్శం నియోజకవర్గం చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీని గెలిపించాలని అభ్యర్థించారు.

లక్షకు పైగా పశువులకు చికిత్స చేసిన ఎస్ఎంఎఫ్ జి ఇండియా క్రెడిట్

విశాలాంధ్ర-ఏలూరు : భారతదేశంలోని ప్రముఖ ఎన్‌బీఎఫ్‌సీ లలో ఒకటైన ఎస్ఎంఎఫ్ జి ఇండియా క్రెడిట్ కో. లిమిటెడ్ (గతంలో ఫుల్లర్టన్ ఇండియా క్రెడిట్ కో. లిమిటెడ్), తమ 6వ పశు వికాస్ డే (పివిడి)ని నిర్వహించింది. దేశంలో ఒకే రోజు నిర్వహించిన అతి పెద్ద పశు సంరక్షణ శిబిరమిది. ఈ శిబిరాలను 14 రాష్ట్రాల్లోని 460 కి పైగా ప్రదేశాలలో ఏకకాలంలో నిర్వహించారు 1 లక్షకు పైగా పశువులకు అవసరమైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందించారు. భారతదేశంలో, 8 కోట్ల కంటే ఎక్కువ కుటుంబాలు నేరుగా పాడి పరిశ్రమతో సంబంధం కలిగి ఉన్నాయి మరియు శ్రామిక శక్తిలో 70 శాతం కు మహిళలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ మహిళల కృషిని స్మరించుకునేందుకు, 6వ పశు వికాస్ దినోత్సవాన్ని 'పాడిపరిశ్రమలో మహిళలు' నేపథ్యం తో వేడుక చేసుకున్నారు. ఈ కార్యక్రమం ఈ ఎస్ జీ ఫ్రేమ్‌వర్క్‌లోని 'సామాజిక' కోణాన్ని ప్రతిబింబిస్తుంది,

అభివృద్ధి పథంలో అనపర్తి

విశాలాంధ్ర - అనపర్తి : వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో సిసి రోడ్లు, డ్రైనేజీలు,పైప్ లైన్లుతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక టిటిడి కళ్యాణ మండపం వద్ద రూ.35.90 లక్షల వ్యయంతో,ధరణికోట ప్రాంతంలో రూ.16.50 లక్షలు, పల్లీల రామాలయం వద్ద రూ.13.50 లక్షలు, చాకలి పేటలో రూ.7.50, సచివాలయం -3 పరిధిలో రూ.6.60 లక్షలు, బుల్లియ్య గారి తోటలో రూ.15.40 లక్షలు, ఎమ్మార్వో కార్యాలయం వద్ద రూ .14 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లు, డ్రైనేజీలు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ప్రారంభించారు. స్థానిక మార్కెట్ ప్రాంతంలో ఫ్యూజ్ కాల్ ఆఫీస్ ప్రారంభించారు.అనంతరం స్థానిక బాపనమ్మ తల్లి ఉపాలయం ప్రాంతంలో రూ.2.21 కోట్ల వ్యయంతో నిర్మించిన పైపులైన్, త్రాగునీటి కొళాయిలు ఎమ్మెల్యే సత్తి ప్రారంభించారు.తదనంతరం కొప్పవరం లే అవుట్ వద్ద రూ.16.70 లక్షల వ్యయంతో నిర్మించే సిసి రోడ్, డ్రైనేజ్ కి ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు), సర్పంచ్ వారా కుమారి, ఉప సర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

విశాలాంధ్ర - కాకినాడ : రానున్న ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో రాజకీయపార్టీలు సహకరించాలని కాకినాడ సిటీ నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ జె. వెంకటరావు కోరారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ 2024 ప్రగతిపై రాజకీయపార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు-పరిష్కారాన్ని ఈఆర్వో వెంకటరావు రాజకీయపార్టీలకు వివరించారు. ఆయా పార్టీల నాయకులు వెలిబుచ్చిన సందేహాలను ఆయన నివృత్తిచేశారు. 80 ఏళ్ళుదాటిన వయోవృద్ధులు, దివ్యాంగులు, అంధులు పోలింగ్‌బూత్‌కు వెళ్ళి ఓటు వేసేందుకు వీలుగా కల్పించిన ప్రత్యేక సదుపాయాలపై సభ్యులు చర్చించారు. అనంతరం ఈఆర్వో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రావూరి వెంకటేశ్వరరావు(వైఎస్ఆర్‌సీపీ), తుమ్మల రమేష్ (టిడిపి), అప్పారావు(బిఎస్పి), ఏఈఆర్వోలు హరిదాసు, దొర, నాగశాస్త్రులు, సీతాపతిరావు, జాన్‌బాబు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.